క్లుప్తంగా

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు

కోటనందూరు: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెపిస్టు టీఎన్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వారి అవసరాలకు అనుగుణంగా వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, వారి ఆరోగ్య మెరుగుదలకు అందించాల్సిన పౌష్టికాహారం పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ రామశేఖర్ ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు పొడిగింపు

గండేపల్లి: ఈ పంట నమోదుకు ఈనెల 25వ తేదీ ముందుగానే నమోదు చెయ్యాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ తెలిపారు. గండేపల్లి వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ల్యాండ్ పార్సిల్‌ను ఈ పంట నమోదులోకి తీసుకురావాలని, ప్రధాన పంటలైన వరి, పామాయిల్ పంటలు నమోదు అయినప్పటికి మిగిలిన పంటలను నమోదుచేయాలన్నారు. గ్రామ కంఠం, వ్యవసాయేతర భూములను ఈ పంటలోకి తీసుకురావాలని సూచించారు.

యూరియా కోసం అవస్థలు



గండేపల్లి సొసైటీలో నమోదు చేయించుకుంటున్న రైతులు

గండేపల్లి: యూరియా కోసం మండల పరిధిలోని రైతులకు అవస్థలు తప్పడం లేదు. గండేపల్లి సొసైటీ వద్ద గత రెండు రోజుల నుంచి రైతులు పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం వచ్చిన స్టాక్‌ను సోమవారం రైతులకు పంపిణీ చేసినప్పటికీ పూర్తిస్థాయిలో అందకపోవడంతో కొంత మంది అసహనంతో వెనుతిరిగారు. మంగళవారం సొసైటీకి 225 బస్తాలు (10 టన్నులు) రావడంతో బుధవారం సొసైటీకి చేరుకున్న రైతులకు ఆధార్, పాస్‌బుక్ ప్రక్రియ ద్వారా సొసైటీ సిబ్బంది రైతులకు యూరియా అందజేశారు. మొత్తంగా 153 మంది రైతులకు యూరియా అందగా మరి కొంతమంది రైతులకు యూరియా కావాల్సిఉండగా నిరుత్సాహంతో వెనుతిరిగారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కిర్లంపూడి సంతమార్కెట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

కిర్లంపూడి: బాణసంచా విక్రయించే వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు. తహసీల్దార్ జె.చిరంజీవి, ఎంపీడీఓ బి.హరికృష్ణ, ట్రైనీ ఎస్సై ఎం.రాజు, ఫైర్ ఆఫీసర్ శ్రీరాముడుతో కలిసి కిర్లంపూడిలోని బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాన్ని బుధవారం పరిశీలించారు. షాపు నిర్వాహణకు లైసెన్స్ హోల్డర్స్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. దుకాణల మధ్య మూడు మీటర్ల దూరం, వాటర్ డ్రమ్ములు, ఇసుకతో పాటు వాహనాల పార్క్ వంటి ఏర్పాట్లు చేయాలన్నారు.

రెవెన్యూ అధికారుల తనిఖీలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలో బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసే ప్రాంతాలను బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి గ్రామాలోని బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ప్రాంతాలను ఎంపిక చేశారు. ప్రదేశాలను స్థానిక తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎస్సై లక్ష్మీకాంతం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ.గోపాలకృష్ణ, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు



అపరిశుభ్రంగా ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఏలేశ్వరం: పట్టణంలో ప్రజల దాహార్తి తీర్చే తాగునీరు వృథాగా పోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రూపులమ్మ గుడి సమీపంలోని జీఎల్ఆర్ ట్యాంక్ నుంచి తాగునీరు వృథాగా పోతుంది. ట్యాంక్ పైపులు లీక్ అయ్యి ట్యాప్ లేకపోవడంతో తాగు నీరు వృథా అవుతుందని అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ట్యాంక్ నిండా చెత్త, నాచు పేరుకుపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏటిగట్టు గప్‌చుప్

- జోరుగా మట్టి తవ్వకాలు
- పోలవరం గట్టును మాయం చేస్తున్న వైనం
- రాత్రి పగలు తేడాలేకుండా తరలింపు



టి.రాయవరం మార్గంలో పోలవరం గట్టును భారీగా తవ్వేసిన మాఫియా

ప్రత్తిపాడు రూరల్: మట్టి అక్రమ రవాణ తిలాపాపం తలాపిడికెడు అన్న చందంగా మారింది. మొన్నటి వరకు పంట పొలాలు, చెరువుల్లో అక్రమ తవ్వకాలు సాగించిన కూటమి మట్టి మాఫియా నేడు మరింత బరి తెగించింది. పోలవరం కాలువ గట్లనే కొల్లగొడుతోంది. రాత్రీపగలు తేడా లేకుండా జేసీబీల సహాయంతో పెద్ద ఎత్తున మట్టిని తవ్వుతూ అక్రమార్జనకు పాల్పడుతోంది. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, జలవనరుల శాఖల అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వ్యవసాయం అవసరాల నిమిత్తం నియోజకవర్గంలో కాలువ నిర్మాణం చేపట్టారు. తవ్వే క్రమంలో వచ్చిన మట్టిని గట్లపై పెద్ద పెద్ద గుట్టలుగా పోశారు. ఎర్రమట్టి కావడంతో మాఫియా కన్ను వీటిపై పడింది. బహిరంగ మార్కెట్‌లో మట్టికి డిమాండ్ ఉండటంతో గత కొన్ని రోజులుగా భారీ ఎత్తున తవ్వకాలు చేస్తూ గట్లను మాయం చేస్తున్నారు. స్థిరాస్తి భూములు, ఖాళీ స్థలాలను పూడ్చేందుకు తరలిస్తూ కాసులు వెనకేసుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడమే ఆలస్యం దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే చందంగా కూటమి నేతలు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో కొండలు, గుట్టలు కొల్లగొడుతున్నారు. అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపట్టి అమ్ముకుని సొమ్ములు చేసుకుంటున్నారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం మండలాలు మీదుగా వెళ్తున్న పోలవరం కాలువ గట్టును కూటమి నేతల పాలిట వరంగా మారింది. పోలవరం కాలువ పొడవునా గట్టును తవ్వేసి మట్టిని భారీ ఎత్తున సొమ్ములు చేసుకుంటున్నారు.

విరామం లేకుండా

ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రానికి కూత వేటు దూరంలోని టి.రాయవరం, లంపకలోవ వెళ్లే మార్గంలో పోలవరం గట్టును రాత్రి, పగలు తేడాలేకుండా జేసీబీతో తవ్వేసి లెక్కకు మించి వాహనాలతో మట్టిని తరలించుకుపోతున్నారు. భారీ ఎత్తున వర్షాలు కురిసి మట్టి తవ్వకాలకు ఆటంకం కలిగితే మినహా మట్టి తవ్వకాలు ఆగడంలేదు. వర్షాకాలంకు ముందు పంట చెవులను తవ్వుకుని సొమ్ములు చేసుకున్నారు. ప్రస్తుతం పోలవరం కాలువ గట్టు మట్టి తవ్వాలకాలకు అడ్డాగా మార్చుకున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

ఇక్కడ తవ్విన మట్టిని లారీలు, ట్రాక్టర్లపై ఇటుక బట్టీలు, లేఅవుట్‌లకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.1,000 నుంచి రూ.1,500, టిప్పర్ మట్టిని రూ.6,000 నుంచి రూ.10,000 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక్కడ తవ్వకాలు జరిపిన మట్టి, గ్రావెలెను జిల్లా వ్యాప్తంగా రవాణా చేస్తూ కూటమి నేత సొమ్ములు చేసుకుంటున్నారు.



లంపకలోవ ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకొని పోలవరం కాలువ గట్టుపై మట్టిని తవ్వుతున్న యంత్రాలు

ఫలితంగా ఇల్లు నిర్మించుకునే సామాన్యుడు మట్టి కొని పునాదులను నింపుకోలేని పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అధికారుల తీరుపైనా స్థానికంగా పలు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకాలను నియంత్రించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు ముదునూరి భరోసా



శరభవరంలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, శరభవరం గ్రామాల్లో బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి రెండు కుటుంబాలకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన మాడబాల లోవరాజు ఇటీవల గుండె పోటుతో, చేబ్రోలు సత్యనారాయణ అనారోగ్యంతో, శరభవరంలో చెందిన అరటికాయ సత్యనారాయణ భార్య మాజీ సర్పంచ్ సత్యవతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు మురళీకృష్ణంరాజు వారి ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీ శాలివాహన కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ అనకాపల్లి నూకరాజు, ఎంపీటీసీ అమరాధి కాశీ, సర్పంచ్ బొండి రాంబాబు, కోలా తాత బాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, తూపాటి బాబ్జి, జువ్వల దొరబాబు, తూపాటి బాబ్జి, రంగనాథం అబ్బాయి, ఉలుసు శివ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సర్పంచ్ అభ్యర్థి నియామకం

కోటనందూరు: టీజే నగరం వైఎస్సార్ సీపీ సర్పంచ్ అభ్యర్థిగా సుర్ల రాజు నియమితులయ్యారు. బుధవారం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గొర్లి రామచంద్రరావు స్థానిక ఇంటి ఆవరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆదేశాలతో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లాలం బాబ్జీ, ఎంపీపీ లగుడు శ్రీనివాసు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా సుర్ల రాజు పేరును ప్రకటించారు. రాజు విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం తుని నియోజక వర్గ అధ్యక్షుడు వెలగా వెంకటకృష్ణాజీ, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి గోవిందు, సర్పంచులు సుర్ల రాంబాబు, జిగటాల వీరబాబు, లెక్కల భాస్కర్, కొరుప్రోలు కృష్ణ, గిడుతూరి రాంబాబు, సుర్ల శ్రీను, వేముల రాజబాబు, గరిసింగు దొరబాబు, కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



రాజును సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సస్యరక్షణతో అత్యుత్తమ ఫలితాలు

తుని రూరల్: మండలంలోని దొండవాక గ్రామంలో బుధవారం మండల ఉద్యాన అధికారి ఎస్.సుజాత ఆధ్వర్యంలో ఉద్యాన రైతులకు మామిడి, జీడి మామిడి సాగుపై అవగాహన సదస్సు, క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రధాన శాస్త్రవేత్త వెంకట నరసింహారావు పాల్గొన్నారు. మామిడిలో చీడపీడల నివారణకు నవంబరులో వేపనూనే ఐదు మిల్లీ లీటర్లు, కార్బనిజం ఒకగ్రాము చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. డిసెంబరులో ఇమిడాక్లోప్రోడ్ 0.3 మిల్లీ లీటర్లు, జనవరిలో లామడా సైహలోత్రిన్ రెండు మిల్లీ లీటర్లు, నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు, ఫిబ్రవరిలో పిప్రోనిల్ రెండు మిల్లీ లీటర్లు, మాంకోజబ్ మూడు గ్రాములు చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే వివిధ రకాల పురుగులు నివారించవచ్చన్నారు. వీహెచ్ఏలు కృష్ణాజీ, ప్రకాష్, కిరణ్, రైతులు పాల్గొన్నారు.



సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న డాక్టర్ వెంకట నరసింహరావు

108లో మహిళ ప్రసవం

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గ్రామానికి చెందిన షేక్ కుమారి 108లో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. కుమారికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108లో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. మార్గ మధ్యలో పాండవులపాలెం–గజ్జనపూడి మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 ఈఎంటీ రాజు, పైలెట్ ఎస్.నరసింహరాజు, ఆశా వర్కర్ రాఘవమ్మ సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రసవం చేయడంతో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా ప్రత్తిపాడు సీహెచ్‌సీలో క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సిబ్బందిని 108 జిల్లా డీఎం అవినాష్, సూపర్‌వైజర్ సతీష్‌తో పలువురు అభినందించారు.



పురుడు పోసిన ఆశావర్కర్ రాఘవమ్మ

సజ్జలను కలిసిన మాజీ ఎమ్మెల్యే జ్యోతుల



సజ్జల రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు బుధవారం తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో నియోజకవర్గ పార్టీ విషయాలను, వివిధ అంశాలపై చర్చించినట్లు జ్యోతుల పేర్కొన్నారు.

ఈకేవైసీని వేగవంతం చేయండి

రౌతులపూడి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే శ్రామికుల ఈకేవైసీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఉపాధి ఏపీడీ జగదాంభ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ బి.శివరామకృష్ణ అధ్యక్షతన ఉపాది సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 24వేల మంది శ్రామికులకుగాను ఇప్పటివరకు 14 వేలు మంది శ్రామికులకు మాత్రమే ఈకేవైసీ నమోదులో భాగమయ్యారన్నారు. మిగిలిన శ్రామికులకు ఈకేవైసీని వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. వచ్చే 2026-27 ఏడాదికిగాను గ్రామ సభలు ద్వారా ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే పనులు గుర్తించడం, శ్రామికులకు పని కల్పించి, గ్రామసభల్లో ఆమోదించి పనులు నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల నిర్వహణలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా పారదర్శకత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ కాంచన, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ జగదాంభ

గమ్యాన్ని చేరేదేలా..!



గండేపల్లిలో హైవే పక్కనే నిలిపిన భారీ లారీ

గండేపల్లి: జాతీయ రహదారిపై భారీ వాహన ప్రయాణానికి ఆటంకం ఏర్పడటంతో రెండు రోజులుగా వాహనాన్ని నిలిపేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒడిషా నుంచి చెన్నై పోర్టుకు కూలింగ్ టవర్‌ను తరలిస్తున్న భారీ లారీ మంగళవారం మండలంలోని గండేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి స్పీడ్ లిమిట్ బోర్డు లారీకి తగిలే విధంగా ఉండటంతో డ్రైవర్, సిబ్బంది గుర్తించి లారీని నిలిపివేసి హైవే అధికారులకు సమాచారం అందజేసి లారీని హైవే పక్కనే ఉన్న పాత రోడ్డులో నిలిపివేశారు. ఈ నేపథ్యంలో లారీ కుడివైపు చక్రాలు ఇటీవల కురిసిన వర్షానికి చక్రాలు దిగబడగా ఎట్టకేలకు బయటకు తీశారు. బుధవారం హైవే అధికారులు స్పీడ్ లిమిట్ బోర్డును తీసే ప్రయత్నం చేసినప్పటికి వీలుకాకపోవడంతో అక్కడే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజమండ్రి హెలియోస్ హాస్పిటల్ వైద్యులు లలిత కంభంపాటి పాల్గొని అండాశయ వ్యాధులు, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఆరోగ్య సంరక్షణకు మహిళలు ప్రాధన్యత ఇవ్వడం తప్పనిసరి అని సూచించారు.

చేతుల శుభ్రతపై అవగాహన



చేతుల శుభ్రతపై అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు

సామర్లకోట: చేతుల శుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. రోగాల బారిన పడకుండా ఉండటానికి బయట నుంచి ఇంటికి వెళ్లిన వెంటనే చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవాలన్నారు. భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి బ్రహ్మానందం, పి.నిర్మల, జి.జ్యోతి, పీడీ సుధారాణి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

శంఖవరం: శరీరానికి సకాలంలో పోషకాహరాన్ని అందిచకలిగితే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఐసీడీఎస్ సీడీపీఓ పర్వత వెంకట లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవం, పోషకాహర మహోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహరం అందించడం ద్వారా విద్యార్థుల్లో రక్తహీనతను అరికట్టవచ్చన్నారు. బాలికలకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఉపాధి పనులకు రూ.10.71 కోట్లు

డ్వామా పీడీ వెంకటలక్ష్మి

సామర్లకోట: మండల పరిధిలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వతేదీ వరకు జరిగిన 944 ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.10,71,42,448 ఖర్చు చేసినట్లు జరిగిందని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మెటీరియల్ రూపంలో రూ.3,83,61,588, వేతన రూపంలో రూ.6,87,80,860 ఖర్చుచేయగా సామాజిక తనిఖీల బృందం రూ.1,72,224 రికవరీ చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలో ఈనెల ఒకటి నుంచి 13 వరకు ఆయా గ్రామాలలో సామాజిక బృందాలు ఉపాధి హామీ పనులను తనిఖీ చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీడీ పి.వసంతమాధవి, డీపీఓ పి.విజయభాస్కర్, డిప్యూటీ డైరెక్టరులు ఏపీసాట్, బి.రామారావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరీ ఎస్ఆర్‌పీ సీహెచ్ సత్యనారాయణ, డీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



సామాజిక తనిఖీల బృందాల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పీడీ తదితరులు

రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఏడీఈఎస్ బి.శివప్రసాద్ ఎంతో కృషి చేశారని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. ఏడీఎస్ బదిలీ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏఈడీఎస్ శివప్రసాద్ భీమవరం బదిలీ కాగా అతని స్థానంలో కర్నూల్ జిల్లా గుత్తి నుంచి పి.ప్రభాకరరావు ఏడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కొత్త ఏడీఈఎస్‌కు రైల్వే అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

ఏలేశ్వరం: భారత రత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మార్స్ కంప్యూటర్స్, డిస్టిక్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం చేసిన సేవలు అపూర్వమన్నారు. కలాం జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ప్రసంగాలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. కలాం నిరంతరం విద్యావ్యాప్తికి కృషి చేశారన్నారు. రాబోయే తరాలకు ఆయన చూపిన మార్గం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కలాం చూపిన బాటలో యువత పయనించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు కిలపర్తి రఘు, సాయితేజ, నేహారేష్మి, నూకరత్నం, రత్నం, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బుధవారం కళాశాల సిబ్బంది ఘనంగా నిర్వహించారు. వరల్డ్ స్టూడెంట్స్ డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆయన చిత్రపటానికి సిబ్బంది పూలమాలలువేసి ఆయన సేవలను కొనియాడారు. అత్యంత సామాన్య కుటుంబం నుంచి జీవితాన్ని ప్రారంభించి..భారతదేశ అత్యున్నత రాష్ట్రపతి పదవి చేపట్టడంతో పాటు రక్షణ రంగంలో మిస్సైల్ మెన్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం నేటి తరం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని సిబ్బంది కొనియాడారు.



ఏలేశ్వరంలో కలాం విగ్రహానికి నివాళు లర్పిస్తున్న దుర్గారావు, విద్యార్థులు

కలాం జీవితమే విద్యార్థులకు పాఠశాల

జగ్గంపేట: మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలిచే మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డా.ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని జగ్గంపేటలో పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, స్వామి వివేకనంద విద్యా సంస్థల అధినేత ఒమ్మి రఘురాం ఆయా విద్యాసంస్థల ఆవరణలో అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్షిపిణి, అంతరిక్ష ప్రయోగాల అభివృద్ధి కార్యక్రమాల్లో అబ్దుల్ కలాం చేసిన కృషి ఎనలేదన్నారు. ఆయన జీవితమే విద్యార్థులకు ఒక పాఠశాల వంటిందన్నారు.

బాలికల హక్కులను కాపాడుకోవాలి

జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి

పిఠాపురం: బాలికల హక్కులను కాపాడుకోవాలని వారిపై ఉన్న లింగ అసమానతలను తొలగించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో గొల్లప్రోలు బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పిఠాపురం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, బాల్యవివాహాలు వల్ల జరిగే అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియ జేసేందుకు ఐక్యరాజ్యసమితి బాలికల దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వేడుకలు అక్టోబర్ 11 నుంచి 18 వరకు జరగనున్నాయని ఈ సమావేశాలలో బాలికలకు వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు కూడా నిర్వహించి వారికి అధికారులతో బహుమతులు అందజేయనున్నారని ఆమె తెలిపారు. మండలంలో పలు పాఠశాలలలో బాలికలకు వ్యాసరచన పోటీలు ఆటపాటల పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి, పాఠశాల ప్రదానోపాధ్యాయుడు సీహెచ్ సూర్యప్రకాశరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.